**ప్రతి మనిషీ దైవమే!**

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబు నందణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న
శుద్ధసత్త్వమిదియె చూడరయ్య!

ఇది తెలిసినవారే యోగులు. ఈ జగత్తులో జీవించే ప్రతి జీవికూడను సత్యమునుండి ఆవిర్భవించి నటువంటిదే! సత్యము లేకుండా ఏమీ జరుగదు. ఆ సత్యం ఒకరి దగ్గరే వున్నది. అది ఈ 'సత్యం' దగ్గరనే (అంటూ భగవాన్ తమ దివ్యహస్త చాలనంతో హిరణ్యగర్భలింగాన్ని సృష్టించారు) 'శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య'. ఇది శుద్ధ సత్త్వము. ఇంకెవరైనా ఈ శుద్ధ సత్త్వమును నిరూపించగలరా? సత్యము ఎక్కడ చూచినా వున్నది. మీరు సత్యాన్ని తలుచుకున్నప్పుడు, సత్యాన్ని చింతించినప్పుడు మీలో కూడా అది ఆవిర్భవిస్తుంది. కనుక, సత్యాన్ని మీరు నిరంతరము స్మరిస్తూ వుండండి.

ఎందుకోసం ఈ దేహానికి 'సత్యసాయి' అని పేరు పెట్టారు? సత్యమే ఈ సాయినుంచి ఆవిర్భవిస్తున్నది. ఎవరు హృదయంలో సత్యాన్ని తలుచుకుంటూ వుంటారో వారిలో 'సత్యం' వున్నాడు. సత్యాన్ని ఎప్పుడూ మరువకూడదు. సత్యముయొక్క ప్రతిబింబము, ప్రతిధ్వని, ప్రతిచర్యయే ధర్మము. 'సత్యానాస్తి పరో ధర్మః' మనము లౌకికంగా ఎన్నో విద్యలు నేర్చుకుంటున్నాము. కాని, ఇట్టి చదువు నిజమైన విద్య కాదు. నిజమైన విద్య ఏమిటంటే హృదయమునుండి ఆవిర్భవించే సత్యమే! సత్యమునకు ఏది రూపము? ధర్మమునకు ఏది రూపము? శాంతికి ఏది రూపము? ఇవన్నీ రూపరహితమైనవి. మన హృదయంలోనే అంతర్భూతమై ఉన్న వీటిని బయటికి తీయాలి.

**నిన్ను నీవు దైవముగా భావించుకో!**

మానవునియందు లేనటువంటి శక్తులు మరి ఏ జీవియందూ లేవు. ఏ దేవునియందూ లేవు. కనుక, మనిషినే దైవముగా భావించుకోవాలి. 'దైవం మానుష రూపేణ'. కాని, మీరు మనిషిని మనిషిగా భావిస్తున్నారు. అందువల్లనే ఇన్ని తప్పులు చేస్తున్నారు. నీవు మానవుడవు కావు. నీవే దైవము. 'యద్భావం తద్భవతి'. నీవు చెడ్డను తలుచుకుంటే నీకన్నీ చెడ్డ తలంపులే వస్తుంటాయి. నిన్ను దైవంగా భావించికో. నీవు తప్పక దైవైనివౌతావు. అందరూ భగవత్స్వరూపులే. అన్ని దేహములందు వున్నటువంటి దైవము ఒక్కడే. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి'. ప్రతి ఒక్కరినీ మనము ప్రేమించాలి. ఎందుకోసమనగా అందరియందు దైవమే వున్నాడు. దైవము లేని స్థానమే లేదు. ఆకాశమునందున్నాడు. జలమునందున్నాడు. ప్రతి ఒక్కటీ దైవమే. ఇట్టి దైవాన్ని మనము వదలిపెట్టి ఏదో కట్టిన దేవాలయాలలో పెట్టిన విగ్రహాలను పూజించుకుంటూ కూర్చుంటున్నాము. దేవాలయాలలో వున్న విగ్రహాలను పూజించుకోండి, తప్పు లేదు. అయితే, ఆ విగ్రహాల్లో వున్న దేవుడే అందరిలోనూ వున్నాడని గుర్తించండి. మీరు పూజించడం తప్పని నేను చెప్పను. కాని, నిజంగా నీవే దైవానివి. నిన్ను దైంగా భావించుకొని అన్నింటియందు దైవమున్నాడని విశ్వసించు, తప్పు లేదు.

దేహమే ఒక దేవాలయము. ఈ దేవాలయములో ఎనర్జీ అనేది ఒకటి వున్నాది. దీనిని వుపయోగించటములో మనము కొంత విచక్షణ వుపయోగించాలి. ఈ 'ఎనర్జీ' దైవమా, లేక 'ఎనర్జీ' నింపుకొన్న దేహము దైవమా? ఈ దేహముకూడను దైవమే. ప్రతి ఇంచియందు, ప్రతి అణువునందు, ప్రతి కణమునందు దైవమున్నాడు. కనుక, దైవాన్ని మీరు మరువకండి. మిమ్మల్ని మీరు మరచినా దైవాన్ని మరచినట్లే. కనుక, మిమ్మల్ని మీరు మరువకూడదు. దీనిని పురస్కరించుకొనియే Always be caerful అన్నారు. ఇదే ABC of life. మీరు

నిరంతరం జాగ్రత్తగా వుండాలి. 'నేను దైవాన్ని స్మరిస్తున్నానా లేక మరచిపోతున్నానా?' అని నిముషనిముషమునకూ మీరు హృదయ పరిశీలన చేసుకోవాలి. 'నేను దేహము కాదు. నేను నేనే' అన్న భావము మీలో నిల్చాలి. అప్పుడు ఇతరులపై మీకు ఏవిధమైన దుర్భావములూ రావటానికి వీలుకాదు.

*మీ అందరియందు నేనే ఉన్నాను*

దైవము అందరియందు వుంటున్నాడు. ఈ జగత్తులో అన్ని శిరస్సులుకూడను దైవముయొక్క శిరస్సులే. కనుకనే, దైవమును విరాటస్వరూపుడన్నారు. మన కంటికి కనిపించేదంతయు భగవంతునియొక్క విరాటస్వరూపమే. ఒక్కొక్క రూపము ఒక్కొక్క రకమైనదిగా వున్నది. కాని, ప్రతి రూపమునందు దైవమున్నాడు. 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'. మీ అందరియందు నేనే ఉన్నాను. నేను వేరు మీరు వేరు కాదు. భగవాన్ మీకంచే ప్రత్యేకంగా లేరు. నేను మీరే, మీరు నేనే. కనుక, మీరు ఏవిధమైన భేదభావములకు అవకాశమివ్వకండి. ప్రేమ ఒక్కటి మాత్రము బలపర్చుకోండి. మీ హృదయంలో ప్రేమ అనే ఫలాన్ని చక్కగా పరిపక్వం గావిస్తే అందరికీ దీని మధుర రసాన్ని పంచవచ్చును. మొట్టమొదట మీ హృదయంలో ప్రేమను పరిపక్వం గావించాలి. మీ హృదయాన్ని ప్రేమమయం గావించినప్పుడు సర్వులుకూడను ప్రేమమయమై పోతారు. అప్పుడు ఎవ్వరినీ మనం ద్వేషించము, హిసించము.

ఈనాడు ఎక్కడ చూచిననూ ద్వేషము, ద్వేషము, ద్వేషము! ఒకరికొకరికి అభిప్రాయ భేదములు. అయితే లౌకిక దృష్టిలో భేదములు కనిపించవచ్చును. కాని, ఆధ్యాత్మిక దృష్టిలో అందరూ ఒక్కటే. ఈ జగత్తులో అన్నీ జీరోలే. భగవంతుడు ఒక్కడు మాత్రమే హీరో. తాను ఒక్కడే 'ఏకం సత్'. ఆ 'ఒకటి' వల్లనే ఈ 'జీరో'లకు విలువ వస్తున్నది. కనుక, భగవంతుడే మనకు ప్రధానము. మన కష్టసుఖములకు, విచారమునకు దుఃఖమునకు మనస్సే కారణము. ఆనందాన్ని అందించేదీ మనస్సే, దుఃఖమును, విచారమును అంధించేదికూడా మనస్సే. మైండును చాలామంది చెడ్డదిగా భావిస్తున్నారు. మైండును మనము సరియైన రీతిలో పెట్టుకున్నప్పుడు అది ఏమాత్రము చెడ్డను అందించదు. మైండునుకూడా దైవముగా భావించండి. అప్పుడు మీరు ఎల్లప్పుడూ ఆనందంగా వుంటారు.

నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వందాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమలం అచలం సర్వధీ సాక్షిభూతం...

అదే ఆత్మ. ఆత్మ అన్నా, మనస్సన్నా, కాన్షియస్‌నెస్ అన్నా అన్నీ ఒక్కటే. కాని, కొన్నికొన్ని పేర్లు మనము ప్రత్యేకంగా పెట్టుకుంటున్నాము. ఇవి కేవలం గుర్తుకోసం పెట్టుకున్నవేగాని సత్యాన్ని నిరూపించేవి కావు.

*ముక్తి కావాలంటే 'నేను ఆత్మను' అని విశ్వసించండి*

ఈ దేహానికి సత్యం అని పెరుపెట్టారు. పేరు దేహానికి పెట్టారేగాని నాకు పెట్ట లేదు. నేను దేహమును కాను. నేను దేహమును కాను. మనస్సును కాను. బుద్ధిని కాను. చిత్తమును కాను. ఊహాకల్పితమును కాను. నేను నేనే. మీరందరూకూడను ఆ విశ్వాసాన్ని దృఢంగా పెట్టుకోవాలి. కాని, కొంతమందికి ఆహారవిహారముల చేత, సంగదోషముచేత మనస్సులు కొంతవరకు మారుతుంటాయి. నీవు ఎలాంటి వారితో సహవాసము చేస్తావో నీవు అలాంటి వాడుగా తయారౌతావు. కనుక, నీవు సత్సంగములో చేరు.

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః

ఐతే, ముక్తి ప్రతి ఒక్కరికీ వస్తుంది. కాని, ఎప్పుడు? 'నేను ఆత్మను' అనే విస్వాసాన్ని దృఢపరచుకున్నప్పుడు నీకు ముక్తి ఒక్క క్షణంలో వచ్చేస్తుంది. 'స్వామి నాలోనే ఉన్నాడు. నేనే స్వామిని' అని తలచుకో. కాని, చంచలమనస్సుతో 'నేనే స్వామిని, నేనే స్వామిని' అనుకుంటే ప్రయోజనం లేదు. స్థిరమైన మనస్సుతో 'నేనే

స్వామిని, నేనే దైవాన్ని' అనుకోవాలి. ఆవిధమైన స్థిరబుద్ధిని ఎప్పుడు సాధిస్తావో అప్పుడే నీవు 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం' అయినటువంటి దైవత్వాన్ని పొందుతావు.

చిత్తశుద్ధియే జ్ఞానసిద్ధి

మనస్సులో మాలిన్యం ప్రవేశించిందంటే అన్నీ చెడిపోతాయి. ఇప్పుడు పొల్యూషన్ వల్ల వాటర్ చెడిపోయింది. మనస్సులో మాలిన్యం తొలగిపోవాలంటే దీనికి తగిన ట్రీట్‌మెంటు భగవన్నామ స్మరణయే. వాటర్ పొల్యూషన్ వల్ల దేహము అనారోగ్యానికి గురౌతుంది. దేహాన్ని కూడను మనము కొంతవరకు కాపాడుకోవలసిందే. ఈ దేహాన్ని నీకు ఎందుకోసం ఇచ్చాడు భగవంతుడు? నిన్ను నీవు తెలుసుకొనే నిమిత్తమై యిచ్చాడు. కాని, అది నీవు మరచిపోయి నీ మనసంతా దేహంపైనే పెడుతున్నావు. దేహంలో ఏముంది? దేహమొక నీటి బుడగ వంటిది. మనసు ఒక పిచ్చి కోతి వంటిది. కాబట్టి, దేహాన్ని, మనస్సును అనుసరించకండి. అంతరాత్మను అనుసరించండి. అది నేర్చుకుంటే మీరు ఎంతైనా ధన్యులైపోతారు. చిత్తశుద్ధియే జ్ఞానసిద్ధి. చిత్తము పరిశుద్ధముగా వుండినప్పుడే జ్ఞానము సిద్ధింస్తుంది. కాబట్టి, మనస్సును పవిత్రంగా పెట్టుకోండి. మనసులో ఎలాంటి చెడ్డ భావాలు వచ్చినప్పటికీ, 'ఇది మంచిది కాదు, ఇది నాకు సంబంధించినది కాదు' అని వాటిని ప్రక్కకు నెట్టివెయ్యాలి. 'ఇవన్నీ నా సొత్తులు కావు. సదాలోచనలు, సద్భావములు .. ఇవే నా ప్రోపరిటీలు' అని భావించాలి. ప్రేమ, ప్రేమ, ప్రేమ ప్రేమయే దైవం. ప్రేమలో జీవించండి. అప్పుడు మీకు అన్నివిధాలుగా మంచే జరుగుతుంది.

*సత్యాన్ని దర్శించాలంటే పదకొండు సెకన్లు చాలు!*

ఇప్పుడు ఇక్కడున్నటువంటి మీలో ఎంతమందికో ఎన్ని భ్రాంతులో, ఎన్ని భ్రమలో వున్నాయి. అయితే, మీరు పరిశుద్ధ హృదయులే. మీలో పవిత్రమైన భావాలున్నాయి. కాని, అప్పుడప్పుడు కొంత మాలిన్యము వచ్చి చేరుతుంటుంది. అది చేరకుండా చూచుకోవాలి. అదే మీ సాధన. నిజంగా సాధన అంటే ఏమిటి? కూర్చొని జపధ్యానములు చేయటం కాదు. ధ్యానమంటే ఏమిటనుకున్నారు? ఏదో దైవాన్ని తల్చుకుంటూ కూర్చోటం అనుకుంటున్నారు. కాదు, కాదు. మీలో వున్నటువంటి పవిత్రమైన భావాన్ని తలుచుకుంటూ రావాలి. మీ సత్యాన్ని మీరు తలచుకుంటూ రావాలి. నిజంగా మీకు మర్మము చెప్పాలంటే ఎంతో సూక్ష్మంగా చెప్పవచ్చు. ఒక పదకొండు సెకన్లు మీరు మనస్సు నిల్పుకోండి ఆ పదకొండు సెకన్ల లోపలనే మీకు తప్పకుండా 'రియలైజేషన్' వస్తుంది. గడియారం మాదిరి మనస్సు తిరుగుతూనే వుంటే అది మెడిటేషన్ అనిపించుకోదు. పదకొండు సెకన్లు మీరు తల్చుకుంటే చాలు. కాని, ఆ పదకొండు సెకన్లు కూడను మీరు తల్చుకోటం లేదు. ఈ పదకొండు సెకన్లలో ఎంతనో సాధించవచ్చు. కనుక, సాధన పేరుతో మీరు అనవసరమైన శ్రమలకు గురి కాకండి. మీరు దేహాన్ని చాలా శ్రమ పెడుతున్నారు. కాలాన్ని, డబ్బునుకూడా వ్యర్థం చేస్తున్నారు. కాలాన్ని వ్యర్థం చేస్తే జీవితమే వ్యర్థమవుతుంది. కాబట్టి, టైమ్ వేస్ట్ చేయకండి. Time is God. God is time. కనుక, మీకు ఎప్పుడు టైమ్ చిక్కినా స్వామిని తలుచుకోండి. అప్పుడు నేను తప్పక మీకు కనిపిస్తాను. మీకు కనిపించటమే కాదు, మీతో సంభాషణకూడా చేస్తాను. స్వామికి ఎన్నో జాబులు వస్తున్నాయి. 'స్వామి నాతో మాట్లాడినారు'అని వ్రాస్తున్నారు. మీరుకూడా ఆవిధమైన నమ్మకాన్ని భద్రంగా పెట్టుకోండి. తప్పక మీకు జయము కలుగుతుంది.

మీరందరూ భక్తులుగానే వచ్చారు. మీ అందరిలోనూ భక్తి వుంది. కాని, భక్తియొక్క గుర్తును మీరు కనుక్కోటం లేదు. అసలు భక్తి అంటే ఏమిటి? నమ్మకాన్ని గట్టిగా పెట్టుకోవాలి. విశ్వాసమెక్కడో అక్కడే ప్రేమ. ప్రేమ ఎక్కడో అక్కడే సత్యము. ఎక్కడ సత్యమో అక్కడే దైవం. సత్యమే మీకు దైవముగా వుంటుంది. మీరు సత్యాన్ని గుర్తించాలంటే పదకొండు సెకన్లు చాలు. పదకొండు సెకన్లు మనస్సు సత్యంలో నిలుపండి. చాలు. పదకొండవసెకను లోపలనే చిక్కుతుంది. మీకు ఆ దర్శనము. మీరు అనవసరంగా గంటలుగంటలు కూర్చొని కాళ్ల నొప్పులు, చేతుల నొప్పులు, నడుం నొప్పులు వచ్చి చాలా బాధపడుతున్నారు. డాక్టర్లు ఇవి 'రుమేటిక్

పెయిన్సు' అంటారు. కాని, ఇవి 'రుమేటిక్స్ పెయిన్సు' కావు. దారి తప్పటం వల్ల వచ్చినటువంటి 'పెయిన్సు'. ఆ పదకొండు సెకన్లలోనే దారి తప్పినారు. ఆ టైము తప్పటం వల్లనే ఈ నొప్పులంతా వస్తున్నాయి. మీరు ఆ టైము తప్పకుండా మీరు ఆ టైము తప్పకుండా వుండండి. ఏ నొప్పీ రాదు.

అంతే కాకుండా మీరు వేళకు సక్రమంగా భోజనం చేయండి. దీంట్లో కొన్ని సూక్ష్మమైన విషయములున్నాయి. మాంసభక్షణ చేయకూడదు. చేపలు తికూడదు. కాని, విదేశీయులకు ఎక్కువగా మాంసాహారమే అలవాటు. కేన్సర్‌వంటి జబ్బులకు మాంసాహారమే కారణము. కాబట్టి, దానిని పూర్తిగా మానివేయండి. ఇంతేగాదు. వారికి cheese అంటే చాలా యిష్టము. ఆ cheese ను మీరు ఎంత అధికంగా తీసుకుంటారో అంత బలహీనులైపోతారు. పాలుకూడా ఎక్కువగా తీసుకోకూడదు. మనం లిమిట్‌గా వుండాలి. పాలు ఎంతనో అందులో నీరు అంత పోయాలి. పెరుగుకూడా అంతే. గట్టిగా వుంటే 'చాలా మంచి పెరుగు' అంటారు. కాని, గట్టిగా వుండకూడదు. అది కొంచెం నీళ్ళగానే వుండాలి. ఈవిధముగా మనము ఆహారమును కంట్రోలు చేసుకోవాలి. దైవప్రార్థనకు ఇది చాలా అవసరం. సరియైన ఆహారమును, ఈ క్రమశిక్షణను పెట్టుకుంటే మీకు దైవ దర్శనము తక్షణమే అవుతుంది. నెలలు, సంవత్సరాల తరబడి మీరు సాధన చేయనక్కరలేదు. ఎప్పటికప్పుడే మీరు ఆనందముగా వుండవచ్చు. ఆనందమనేది దైవముయొక్క స్వరూపమే!

*విషయవాసనలు తగ్గించుకోవాలి*

'నాకు ఆనందం కావాలి' అని మీరనుకుంటారు. కాని, ఆనందము ఎక్కడనుండి వస్తుంది? ఏదైనా షాపునుండి కొనటానికి వీలవుతుందా? లేకపోతే ఏదైనా హోటల్‌కు వెళ్ళి భుజించటానికి వీలవుతుందా? కాదు. ఆనందము మీనుంచే రావాలి. ఆనందమే మీ స్వరూపము. పుట్టినప్పుడు మీరు ఆనందముగానే వున్నారు. కాని, తరువాత ఈ ప్రపంచముయొక్క వాసనలు తగిలి మీరు ఏడుపు ప్రారంభించారు. ఈ విషయ వాసనలు తగ్గించుకోవాలి. Less luggage more comfort, make travel a pleasure. కాని, మీరు అనవసరంగా లేనిపోని attchments పెట్టుకొని, దేహాన్ని బలహీనం చేసుకొని విచారంలో మునిగిపోతున్నారు. ఈ విచారంకూడా చాలా చెడ్డది. hurry, worry, curry ఈ మూడూ చేరేసరికి గుండె చాలా బలహీనమవుతున్నది. కనుక, ఈ hurry, worry, curry లను దూరం చేసుకోండి. ఏదైనా కష్టం కలిగితే 'ఎట్లా వచ్చిందో అట్లే పోతుంది. నాకేమీ నష్టం లేదు' అనుకోండి. వచ్చినది ఏనాటికైనా పోతుంది. దేహాలు కూడా అంతే. కనుక, మనం దేహాలతో ఎంతవరకు అవసరమో అంతవరకే సంబంధము పెట్టుకోవాలి. ఒక లిమిట్‌లో పెట్టుకోకపోతే దేహం అనారోగ్యానికి గురౌతుంది. ఈవిషయంలో మీరు చాలా జాగ్రత్తగా మెలగాలి. సాధన చేసేవారు, దైవాన్ని చూడాలని, దైవంతో మాట్లాడాలని ఆశించేటువంటి వాళ్ళు చెప్పినట్లు చేయండి. తప్పక మీరు దైవాన్ని చూస్తారు. దైవంతో మాట్లాడుతారు.

*దేహమునైనా వదలవచ్చుగాని, ప్రేమను వదలకూడదు*

భక్థి అనగా కేవలం పూజలు చేయటం, వ్రతాలు చెయటం, జపము చేయటం... అంతమాత్రమే కాదు. భగవంతునిపై చలించని, భ్రమించని ప్రేమయే నిజమైన భక్తి. దానికంటె మించినది మరొకటి లేదు. దేహమైనా మనం వదలిపెట్టవచ్చుగాని, ప్రేమను వదలిపెట్టకూడదు. ప్రేమ ఎప్పుడూ చలించనటువంటిది, భ్రమించనటువంటిది, నాశనము కానటువంటిది. అట్టి ప్రేమను మీరు భద్రంగా పెట్టుకోవాలి. అప్పుడు మీకు తప్పక దివ్యత్వము లభ్యమౌతుంది. కాని, మీరు ఈ లోకముతో అమితంగా సంబంధము పెట్టుకోటం చేత ఈనాడు రాక్షసత్వము పెరిగిపోతున్నది. కామ, క్రోధములు రెండూ మానవునికి పరమ శత్రువులు. ఎప్పుడూ ప్రేమతో వుండాలి. నవ్వుతూ వుండాలి. కాని, కొంమంది ముఖము చూస్తే 'కోస్ట్రాయిల్ ఫేస్' మాదిరి కనబడుతుంది. ఎప్పుడూ నవ్వుతూ వుండాలి. నవ్వుతూ వున్నప్పుడు ప్రేమ సహజంగా వస్తుంది.

*ప్రేమను మించినటువంటి ఔ‘ధం మరొటి లేదు*

దైవం ఎల్లప్పుడూ చిరునవ్వులు నవ్వుతుంటాడు. విచారము, దుఃఖము అనేవి దైవానికి ఏమాత్రమూ లేవు. నన్ను చూడండి. నేను నిరంతరమూ చిరునవ్వులు చిందిస్తుంటాను. నాకు ఎట్టి బాధలూ లేవు. ఏదో పిల్లలు చేసిన పొరపాటు వల్ల ఈ కాలుకు దెబ్బ తగిలింది. తుంటి ఎముకకు నాలుగు cracks వచ్చాయి. డాక్టర్లు వచ్చి ఏమేమో బేండేజిలు కట్టాలన్నారు. నేను అంగీకరించ లేదు. ఆ స్థితిలో కూడా నేను నడచుకుంటూనే వచ్చి పైనుంచి అందరికీ దర్శనమిచ్చాను. ఇప్పుడు ఒక కాలుకంటె మరొక కాలు రెండించిలు తగ్గింది. అమెరికానుండి, ఇంకా ఎక్కడెక్కడనుండో ఎంతోమంది డాక్టర్లు, స్పెషలిస్టులు వచ్చారు. సింగపూర్‌నుండి డాక్టర్. పిళ్ళై, ఆయన కొడుకుకూడా వచ్చారు. ‘స్వామీ! ఐదు నిముషాలు మాకివ్వండి’ అన్నారు. ‘మీకు ఆధ్యాత్మికంగా కావలిస్తే ఐదు గంటలిస్తాను. కాని, ఈ శరీరాన్ని ఐదు నిముషాలు కూడా యివ్వను’ అన్నాను. నాకు ఒక చిన్న నొప్పిగాని, నరములయొక్క బాధగాని ఏమాత్రమూ లేవు. సహజంగా నేను నడుస్తాను. అప్పుడు ఎంత బరువు వుండినానో అంత బరువే ఇప్పుడుకూడా వున్నాను. అప్పుడు ఈ దేహము యొక్క బరువు 110 పౌండ్లు. ఇప్పుడుకూడా 110 పౌండ్లే. ఒక సగం పౌండైనా తగ్గలేదు, సగం పౌండైనా పెరగలేదు. నేను ఎప్పుడూ ఆరోగ్యంగానే వున్నాను. నా విషయమై మీరెవ్వరూ బాధపడనక్కరలేదు. బాహ్యంగా చూస్తే ‘స్వామికి చాలా నొప్పిగా వుందేమో’ అని మీరు అనుకుంటారు. ఏమీ నొప్పి లేదు. మీ ప్రేమయే నా నొప్పినంతా పరిహారం చేస్తుంది. మిమ్మల్ని చూస్తే చాలు, నాకెంతో ఆనందం కలుగుతుంది. మీతోనే నాకు నొప్పి పోవలసిందేగాని డాక్టర్లుతో కాదు. ఈనాడు యింతమంది ఈ ప్రదేశానికి చేరటం చూస్తుంటే.. ఇంతమంది ప్రేమకు నేను పాత్రుడనైనాను కదాయని నాకెంతో ఆనందముగా వున్నది. ఇక్కడే కాదు, ఎక్కడైనా సరే, మీరు హ్యాపీగీ వుండండి. నేను ఎప్పుడూ హ్యాపీగానే వుంటాను. మిమ్మల్ని చూస్తుంటే నాకెంతో ఆనందం కలుగుతోంది. ఇది మీ అదృష్టము. మీరందరూ చాలా భక్తితో, ప్రేమతో వచ్చారు. అందువల్ల రేపటినుంచి మీ మధ్యకు నడుచుకుంటూ వచ్చి దర్శనమివ్వాలని నాకెంతో ఉత్సాహం కలుగుతోంది. ప్రేమను మించిన ఔషధం మరొకటి లేదు. మీ ప్రేమయే నాకు ఔ,దం. అది చాలా శక్తివంతమైనది. అదేవిధంగా, నా ప్రేమయే మీ అందరికీ దివ్యౌషధం.మీరు నిరంతరం సుఖశాంతులతో వుండండి. ఒకే కుటుంబములోని సభ్యుల మాదిరి అన్యోన్యంగా, ఆనందంగా జీవించండి. చిన్నచిన్న బాధలకు లొంగిపోకండి. ఎటువంటి చింతలకు చోటివ్వకండి. భార్యకు జబ్బు వచ్చినా, బిడ్డలకు జబ్బు వచ్చినా ఆందోళన చెందకండి. తప్పక అంతా బాగుటుందన్న విశ్వాసంతో మీమీ ఇళ్ళకు తిరిగి వెళ్ళి సుఖశాంతులతో జీవించండి. (స్వామి తాము సృష్టించిన లింగాన్ని చూపిస్తూ..) దీనిని అందరూ చూచారా? చాలా బరువుగా వుంది. శివరాత్రినాడు దీనికంటే పెద్దది వస్తుంది గొంతునుంచి.